క్లుప్తంగా

ధ్యానం, వ్యాయామంపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రామారెడ్డి

కరప: మండలంలోని వేళంగి జెడ్పీ ఉన్నత పాఠశాలలో డిస్ట్రిక్ట్ మెంటల్ హెల్త్ ప్రోగ్రాం కన్సల్టెంట్, మానసికవైద్య నిపుణుడు డాక్టర్ తేతలి రామారెడ్డి యోగా, ధ్యానం వల్ల లభించే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుతో పాటు పదిమందితో మాట్లాడేలా జీవన నైపుణ్యం పెంచుకోవాలన్నారు. హెచ్ఎం కె.భారతి, వేళంగి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఎంకే సౌజన్య, డాక్టర్ సి.సింధూర తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలపై అవగాహన



ప్రొఫెసర్ సంజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: స్థానిక రోటరీ హాల్‌లో శనివారం రోటరీ గోల్డెన్ జూబ్లీక్లబ్ అధ్యక్షులు నరహరిశెట్టి రవికృష్ణ అధ్యక్షతన రాజీవ్‌గాంధీ మేనేజ్‌మెంట్ కళాశాలలో నాయకత్వ లక్షణాలు అనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ కె.సంజయ్‌కుమార్ పాల్గొని రోటరీ వంటి అంతర్జాతీయ సేవా సంస్థలు సమాజంలో ప్రజలు అవసరాలను గుర్తించి వారికి అవసరమైన ప్రాజెక్టులు రూపకల్పన చేస్తున్నాయన్నారు. ఇటువంటి సేవా సంస్థల్లో పనిచేయడం ద్వారా నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవచ్చునన్నారు. అనంతరం సంజయ్ కుమార్‌ను క్లబ్ సభ్యులు సత్కరించారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ పద్దరాజు, మాజీ గవర్నర్ ఎస్‌వీఎస్ రావు, క్లబ్ కార్యదర్శి జోగా చంద్రరావు (చందు) తదితరులు పాల్గొన్నారు.

నానో టెక్నాలజీ, బయో మెడికల్ అప్లికేషన్‌పై సదస్సు

బాలాజీచెరువు: పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నానో టెక్నాలజీ, బయో మెడికల్ అప్లికేషన్‌పై శనివారం సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా నేషనల్ ఫిజికల్ ల్యాబొరేటరీ శాస్త్రవేత్త భావనారాయణ హాజరై వైద్య రంగంలో నానో పదార్థాల పాత్ర వివరించారు. వైద్య రంగంలో బయోమెడికల్ రంగ ప్రాధాన్యతను వివరించారు. తాడేపల్లిగూడెం క్యాంపస్ ఫిజిక్స్ అధ్యాపకులు డాక్టర్ కేఎస్ రాంబాబు, కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యం, కన్వీనర్ డాక్టర్ ఏలియా, కన్వీనర్ చక్రవర్తి, ఆర్గనైజింగ్ కార్యదర్శి కృష్ణ ప్రసాద్, పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు కర్రి భామిరెడ్డి పాల్గొన్నారు.

ఇంజినీర్లకు ఆదర్శం కేఎల్ రావు



కేఎల్ రావు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న వీసీ ప్రసాదరాజు తదితరులు

బాలాజీచెరువు: భావి ఇంజినీర్లు డాక్టర్ కేఎల్ రావును ఆదర్శంగా తీసుకుని దేశ సర్వోతోముఖాభివృద్ధికి కృషి చేయాలని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో ఉన్న ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ భవనంలో పద్మభూషణ్ డాక్టర్ కానూరు లక్ష్మణరావు 122 జయంతిని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ కాకినాడ లోకల్ సెంటర్, రిటైర్డ్ ఇరిగేషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం లేని రోజుల్లో కేఎల్ రావు తన ప్రతిభను చాటి సరికొత్త అవిష్కరణకు నాంది పలికారన్నారు. కాకినాడ ఐఈఐ కాకినాడ లోకల్ సెంటర్ చైర్మన్ మాలోతు రమేష్, రిటైర్డ్ ఇంజినీర్ రామారావు, ఎస్.కృష్ణారావు పాల్గొన్నారు.

టిడ్కో పనులు వేగవంతం చేయండి



టిడ్కో ఇళ్లను సందర్శించిన కమిషనర్ మహేష్‌కుమార్

కాకినాడ: టిడ్కో ఇళ్ల సముదాయంలో మౌలిక వసతుల కల్పనను వేగవంతం చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన నగరపాలక సంస్థ, టిడ్కో అధికారులతో కలసి టిడ్కో ఇళ్లను సందర్శించి పనుల ప్రగతిని ఆరా తీశారు. పనులను పూర్తి నాణ్యతా ప్రమాణాలతో వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట నగరపాలక సంస్థ డీఈ మాధవి, టిడ్కో ఈఈ రీటా, ఏఈ రాజు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

సొంతింటి సమస్యకు తెర

- 40 ఏళ్లుగా పోరాడుతున్న తారకరామా నగర్ వాసులు
- ఎమ్మెల్యే కన్నబాబు చొరవతో ఇళ్లను పరిశీలించిన కలెక్టర్
- అర్హులకు న్యాయం చేయాలని అధికారులకు ఆదేశం



తారకరామా నగర్‌లోని ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే కన్నబాబు తదితరులు

కాకినాడ సిటీ: మండలంలోని కొవ్వూరు పంచాయతీ తారకరామా నగర్ వాసుల 40 ఏళ్ల సొంతింటి సమస్యకు తెరపడింది. హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా అప్పట్లో నిర్మించుకున్న ఇళ్లకు పట్టాలు లేకపోవడంతో వారికి రుణాలు పొందే అవకాశం కానీ, ఇతర కార్యక్రమాలు నిర్వహించుకునే వీలు లేకుండా పోయింది. ఎంతమందిని ఈ విషయమై వేడుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. స్థానిక ప్రతినిధులు పబ్బినీడి రమేష్ బాబు, గుత్తుర్తి రాజేష్, పంతాడి ధర్మారావు, పిల్లి చక్రరావు ఈ విషయాన్ని ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు వివరించారు. ఆయన కలెక్టర్ కృతికా శుక్లాకు సమస్య వివరించారు. దీంతో ఆమె శనివారం తారకరామా నగర్‌ను సందర్శించి అర్హులైనవారికి పట్టాలిచ్చేందుకు సుముఖత వ్యక్తం చేశారు. రూరల్, అర్బన్ తహసీల్దార్లను పిలిచి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే ఈ ప్రాంతానికి కాకినాడ నగరం నుంచి వచ్చేందుకు ఉప్పుటేరుపై ఉన్న ఇరుకైన వంతెనను, ఉప్పుటేరును ఆమె ఎమ్మెల్యే కన్నబాబుతో కలసి పరిశీలించారు. తమ సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యే కన్నబాబును వారు ప్రశంసలతో ముంచెత్తారు. వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. సర్పంచ్ పిల్లి చక్రరావు, ఉప సర్పంచ్ పబ్బినీడి రమేష్‌బాబు, ఎంపీటీసీలు ఊబా నాగమణి, కొండేటి బుచ్చిరాజు, కాకి నూకరాజు, మల్లాడి మల్లేష్, వైఎస్సార్ సీపీ నాయకులు దామలంక పల్లంరాజు, గొల్లపల్లి బాబులు, దుగ్గన దొరబాబు, దాట్ల సత్యనారాయరాజు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- తారకరామా నగర్‌లో గడప గడపకూ

కాకినాడ సిటీ: రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. మండలం కొవ్వూరు పంచాయతీ తారకరామానగర్‌లో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. గ్రామంలో ప్రతి గడపకూ వెళ్లిన కన్నబాబు ప్రభుత్వం ద్వారా గృహస్తులు అందుకున్న పథకాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబం సంక్షేమ పథకాల ద్వారా లక్షలాది రూపాయలు లబ్ధి పొందిందన్నారు. తారకరామా నగర్ పరిధిలోనే 327 మందికి రూ. 9.05 లక్షలు పింఛన్లు అందుకొంటున్నారన్నారు. గ్రామాల్లో వలంటీర్ల సేవలు అభినందనీయమన్నారు. ప్రజలు వివరించిన సమస్యలను అక్కడికక్కడే అధికారులను పిలిచి పరిష్కరించారు. పంచాయతీ కార్యదర్శి జొన్నాడ నరసింహారావు, సర్పంచ్ పిల్లి చక్రరావు, ఉప సర్పంచ్ పబ్బినీడి రమేష్‌బాబు, ఎంపీటీసీలు ఊబా నాగమణి, కొండేటి బుచ్చిరాజు, కాకి నూకరాజు, మల్లాడి మల్లేష్, వైఎస్సార్ సీపీ నాయకులు దామలంక పల్లంరాజు, గొల్లపల్లి బాబులు, దుగ్గన దొరబాబు, దాట్ల సత్యనారాయరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంకల్పం మేరకే సంస్కరణలు

- జగనన్న సురక్షలో ఎమ్మెల్యే ద్వారంపూడి



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: ప్రజా సంకల్పం, ఆకాంక్షలకు అనుగుణంగానే సీఎం జగన్ అనేక పాలనా సంస్కరణలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. ఇందులో భాగంగానే వారికి అవసరమైన సేవలను మరింత దగ్గరగా అందించే లక్ష్యంతో సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. శనివారం ఆయన స్థానిక 11, 25, 32 డివిజన్లలో జగనన్న సురక్ష కార్యక్రమాల్లో పాల్గొని పలువురికి ధ్రువ పత్రాలు అందజేశారు. దూరదృష్టి కలిగి ప్రజా సేవ పట్ల చిత్తశుద్ధి ఉన్న సీఎం జగన్‌ను ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మార్కెటింగ్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, మాజీ కార్పొరేటర్లు గద్దేపల్లి దానమ్మ, రోకళ్ల సత్యనారాయణ, సంగాని నందం, జగన్నాథన్ విజయ్‌కుమార్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ–జనసేనలను నమ్మొద్దు

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అబద్ధపు హామీలతో ముందుకు వస్తున్న జనసేన, తెలుగుదేశం పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక 31వ డివిజన్‌లోని రాగంపేటలోని రెల్లిపేట ప్రాంతంలో ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వం అందించిన పథకాలను ప్రజలకు వివరించారు. డివిజన్‌లో ఇప్పటికే చాలా వరకు అభివృద్ధి పనులను పూర్తి చేశామని, త్వరలోనే మిగిలిన పనులకు టెండర్లు కూడా పిలుస్తున్నామన్నారు. అలాగే అత్యాధునిక హంగులతో కల్యాణ మండపాన్ని కూడా నిర్మిస్తున్నామన్నారు. సీఎం జగన్ పాలనలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారని, అయితే అధికారం కోసం ప్రజలను మభ్యపెట్టేందుకు ఆ రెండు పార్టీలు తప్పుడు వాగ్దానాలతో ప్రజల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నాయన్నారు. వీరి కల్లబొల్లి మాటలు నమ్మవద్దని ఎమ్మెల్యే సూచించారు. స్థానిక నాయకులు లావేటి అమర్, నీలాపు కిశోర్, గర్రె బాబ్జీ, మల్లిపూడి రమణ, పలువురు మాజీ కార్పొరేటర్లు ఆయన వెంట ఉన్నారు.



సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

ఓటర్ల జాబితా పరిశీలనకు సన్నద్ధంకండి

కాకినాడ సిటీ: ఈనెల 21వ తేదీ నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు సుమారు నెల రోజుల పాటు క్షేత్ర స్థాయిలో ఓటర్ల జాబితా పరిశీలన జరగనున్న నేపథ్యంలో పర్యవేక్షణ అధికారులు సంసిద్ధంగా ఉండాలని నియోజకవర్గం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎస్‌వీవీ సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. అధికారులు రోజువారి లక్ష్యాలను నిర్దేశించుకుని దోషరహిత జాబితా రూపకల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలో సుమారు రెండు లక్షల 55 వేల 137 మంది ఓటర్లు ఉన్నారని, సుమారు 18 మంది పర్యవేక్షణ అధికారులు ఓటర్ల జాబితాను రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలసి పరిశీలిస్తామని తెలిపారు. తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, పరిపాలనాధికారి వరహాలయ్య, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ చైనులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎన్నికల అధికారి సత్యనారాయణ

ద్వారంపూడిని కలసిన 'ముదిరాజు' చైర్మన్

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): రాష్ట్ర ముదిరాజు కార్పొరేషన్ చైర్మన్ కె. వెంకటనారాయణరావు శనివారం ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డిని కాకినాడలోని ఆయన నివాసంలో కలుసుకున్నారు. ముదిరాజులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే ద్వారంపూడి వారికి హామీ ఇచ్చారు. బీసీల పాలిట దేవుడు సీఎం జగన్ అని నారాయణరావు అన్నారు.

నేడు పంచారామ క్షేత్రంలో శాకంబరి అలంకరణ

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలోని అమ్మవారు ఆదివారం శాకంబరిగా దర్శనమివ్వనున్నారు. ఏటా ఆషాఢ మాసంలో మాస శివరాత్రి రోజున అమ్మవారిని ఇలా అలంకరించడం ఆనవాయితీ. ఆదివారం ఉదయం 9.30 నిమిషాలకు అమ్మవారికి ఆషాఢ సారే సమర్పించనున్నట్టు ఈఓ నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శనివారమే సుమారు 800 కిలోల కూరగాయలు, ఆకుకూరలతో అమ్మవారికి అలంకరణ పనులు ప్రారంభించారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం

కరప: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహిస్తూ, వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఈఓ పీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు సూచించారు. నడకుదురు, జెడ్.భావారం, కొరిపల్లి తదితర గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించి, కార్యదర్శులకు పలు సూచనలిచ్చారు. డ్రెయిన్లలో పూడిక తీయించి, నీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యదర్శులు పీఎస్‌ఆర్‌వీ బ్రహ్మానందం, పి.ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాబాయి దేశ్‌ముఖ్ జయంతి



దుర్గాబాయి దేశ్‌ముఖ్ అవార్డు స్వీకరిస్తున్న డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి



దుర్గాబాయి దేశ్‌ముఖ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చంద్రకళాదీప్తి, నాయకులు



బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో దుర్గాబాయి దేశ్‌ముఖ్‌కు నివాళులు

కాకినాడ కల్చరల్: ఆల్ ఇండియా ఉమెన్స్ కాన్ఫెరెన్స్ (కాకినాడ శాఖ) సేవలు ఆదర్శనీయమని ప్రముఖ వైద్యులు, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ మాజీ వీసీ డాక్టర్ ఐవీ రావు అన్నారు. స్థానిక జేఎన్‌టీయూకే సెనెట్ హాల్‌లో శనివారం సాయంత్రం కాన్ఫెరెన్స్ సమావేశం జరిగింది. ముందుగా దుర్గాబాయి దేశ్‌ముఖ్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. తదుపరి ప్రతిభగల పేద విద్యార్థినులకు నగదు పురస్కారం ప్రదానం చేశారు. అనంతరం పద్మ విభూషణ్ దుర్గాబాయి దేశ్‌ముఖ్ అవార్డును సిడో సంస్థ (కాన్ఫరెన్స్ అనుబంధ సంస్థ) వ్యవస్థాపకురాలు డాక్టర్ ఆలూరి విజయలక్ష్మికి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వక్తలు ఆలూరి సమాజసేవను కొనియాడారు. సిడో కార్యదర్శి పద్మజావాణి, ఆల్ ఇండియా కాన్ఫరెన్స్ (కాకినాడ శాఖ) అధ్యక్షురాలు డాక్టర్ ఎంవీ భరత్ లక్ష్మి, డాక్టర్ శైలజ, నన్నయ వర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కమలకుమారి, భానుమతి తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

కాకినాడ రూరల్: దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ జయంతిని సర్పవరం జంక్షన్‌లోని వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. గ్రంథాలయ సంస్థ విశ్రాంత ఉద్యోగి చింతపల్లి సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొని సంఘ సంస్కర్తగా, న్యాయవాదిగా, రచయితగా దుర్గాబాయి సేవలను వివరించారు. 1909 జూలై 15న రాజమహేంద్రవరంలో జన్మించిన ఆమెకు పద్మ భూషణ్, పద్మ విభూషణ్ వంటి పురస్కారాలు లభించాయని, సామాజిక సర్వీస్ మదర్‌గా దుర్గాబాయి దేశ్‌ముఖ్ కీర్తించబడ్డారన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దుర్గాబాయికి రాగిరెడ్డి నివాళి

కాకినాడ: దుర్గాబాయి దేశ్‌ముఖ్ సేవలు ఆదర్శప్రాయమని కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి పేర్కొన్నారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ జయంతి సందర్భంగా శనివారం స్థానిక గాంధీనగర్ పార్కులోని దుర్గాబాయి విగ్రహానికి నివాళులర్పించారు. ఆల్ ఇండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్ కాకినాడ శాఖ, మైత్రేయి ఉమెన్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యురాలు డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి, ఎఐడబ్ల్యూసీ కాకినాడ ఉపాధ్యక్షురాలు భరతలక్ష్మి, సంస్థ కార్యదర్శి ఎస్.భానుమతి, మైత్రేయి సంస్థ అధ్యక్షురాలు సుశీ ఆదిత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు వందనం

సేవలతో సంతృప్తి

నడకుదురులోని గరగ నారాయణ రావుకు గ్రామ వలంటీర్ కె.భాగ్యశ్రీ పింఛన్ వచ్చేలా ఎంతో కృషి చేశారు. ఆయన భార్య సూర్యకళావతికి కాపునేస్తం గురించి వివరించి ఆ పథకాన్ని వర్తింపజేశారు. వాటికి తోడు వాళ్ల కుమార్తె పుష్పలత పేరున పంటపొలం ఉంటే రైతు భరోసా వచ్చేలా చేశారు. గ్రామవలంటీర్ భాగ్యశ్రీ అందిస్తున్న సేవలకు ఆయా కుటుంబాల వారు ఎంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



నడకుదురులో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న వలంటీర్ భాగ్యశ్రీ

తెల్లవారక ముందే పింఛన్ ఇస్తున్నారు



నా భర్తకు పింఛన్ రాయించడమే కాకుండా, ప్రతినెలా ఒకటో తేదీనే తెలవారక ముందే పింఛన్ చేతిలో పెడుతున్నారు. దరఖాస్తులపై సంతకాలు చేయించుకుని కాపునేస్తం, డ్వాక్రా రుణమాఫీ, సున్నావడ్డీ వచ్చేలా చేశారు. మా అమ్మాయికి రైతు భరోసా వచ్చేలా చేసి మా కుటుంబానికి భరోసా కల్పించిన వలంటీర్ సేవలు ఎప్పటికీ గుర్తించుకుంటాం.

– గరగ సూర్యకళావతి, నడకుదురు

కుటుంబ కష్టంలో ఉన్నానని..

ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా 9వ డివిజన్‌లో పనిచేస్తున్న జి.దుర్గ అనే వలంటీర్ ప్రజలతో మమేకమై నిజమైన సేవకురాలిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆమె పరిధిలో ఉన్న గుర్రం గోవిందు ఓ భవనం పై నుంచి జారిపడి మృతి చెందాడు. అతని కుటుంబానికి వారం రోజుల వ్యవధిలోనే ప్రమాద బీమా కింద రూ.4.9 లక్షలు వచ్చేందుకు వలంటీర్ దుర్గ ఎంతో శ్రమించారు. ఈ సొమ్ము అందడంతో పేదరికంలో ఉన్న అతని భార్య, ఇద్దరు పిల్లలకు ఆసరా కల్పించారు. అలాగే ఒకటో తేదీన పింఛన్ తీసుకునే సమయంలో అనేకసార్లు లబ్ధిదారులు ఆస్పత్రుల్లో ఉంటే అక్కడకు వెళ్లి మరీ పంపిణీ చేస్తున్నారు.



గోవిందు భార్య, పిల్లలకు బీమాపత్రాలు అందజేస్తున్న వలంటీర్ దుర్గ

వలంటీర్ సహాయం వల్లే...



కష్టాల్లో ఉన్న మా కుటుంబానికి వలంటీర్ దుర్గ ఎంతో చేదోడుగా నిలిచారు. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రమాద బీమా సొమ్ముతో పాటు వితంతు పింఛన్ కూడా వచ్చేలా చర్యలు తీసుకున్నారు. ఆమె చేసిన సహాయం ఎప్పటికీ మర్చిపోలేనిది. సీఎం జగన్ నియమించిన వలంటీర్లు మా లాంటి పేదవాళ్లకు అండగా నిలిచి ఎంతో సహాయపడుతున్నారు.

– గుర్రం రమణ, లబ్ధిదారు, వెంకట్‌నగర్, కాకినాడ

మంత్రి సీదిరిని కలసిన ఎంపీ, ఎమ్మెల్యేలు

కాకినాడ సిటీ: జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీదిరి అప్పలరాజును ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, జ్యోతుల చంటిబాబు, కలెక్టర్ కృతికా శుక్లా మర్యాద పూర్వకంగా కలిశారు. జగ్గంపేట నియోజకవర్గ సమీక్ష సమావేశం నిమిత్తం శనివారం జిల్లాకు వచ్చిన ఆయనను స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో వారు కలిశారు. జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ ఎస్.సూర్యప్రకాశరావు, మత్స్యశాఖ జేడీ పి.సత్యనారాయణ, ఆర్డీవో ఎస్‌వీవీ సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మంత్రి అప్పలరాజును కలిసిన ఎంపీ గీత, కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యేలు కన్నబాబు, చంటిబాబు తదితరులు

సురక్ష సేవలు @30 లక్షలు



తిమ్మాపురంలో సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



గురజనాపల్లిలో ధ్రువపత్రాలు అందజేస్తున్న నాయకులు, అధికారులు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- 15 రోజుల్లోనే అనూహ్య స్పందన


కాకినాడ రూరల్: ప్రజలకు అవసరమయ్యే 11 రకాల ధ్రువపత్రాలను ఉచితంగా అందజేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమానికి అనూహ్య స్పందన వస్తోందని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. కేవలం 15 రోజుల వ్యవధిలో రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల సర్టిఫికెట్లను పంపిణీ చేసినట్టు ఆయన తెలిపారు. కాకిడ రూరల్ తిమ్మాపురం, రమణయ్యపేట సచివాలయం – 3 పరిధిలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగాయి. తిమ్మాపురం పంచాయతీ వద్ద సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నబాబు సర్టిఫికేట్లను పంపిణీ చేశారు. గతంలో సర్టిఫికెట్ల కోసం కార్యాలయాల చుట్టూ ఎక్కేమెట్టు, దిగే మెట్టుగా ఉండేదని, నేడు ఆ పరిస్థితి లేదని కురసాల అన్నారు. వలంటీరే అందరికీ అవసరమైన వివిధ సర్టిఫికెట్లను ఈ కార్యక్రమం ద్వారా అందజేస్తున్నారని ఆయన అన్నారు. ఈ మధ్య పవన్ కల్యాణ్ వలంటీర్ వ్యవస్థపై దుర్మార్గమైన ఆరోపణలను పట్టించుకోవద్దని సూచించారు. తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ గ్రామానికి మేలు చేసే కార్యక్రమాలు చేస్తామన్నారు. మండల సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, ఎంఈఓ ఎల్.గణేష్‌బాబు, ఎంపీటీసీ ముద్దన వెంకట్రాజు, సాంబత్తుల శివ, శ్రీనుచంద్ర, పంచాయతీ కార్యదర్శి కర్రి శ్రీను, కొప్పిశెట్టి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

గురజనాపల్లిలో..

కరప: మండలంలోని గురజనాపల్లిలో శనివారం ఏర్పాటుచేసిన జగనన్న సురక్ష శిబిరాన్ని సర్పంచ్ అనసూరి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఎంపీడీఓ కె.అప్పారావు కార్యక్రమంలో పాల్గొని 274 మందికి ధ్రువపత్రాలు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు పబ్బినీడి పాపారావు, జొన్నలగడ్డ కృష్ణమూర్తి, పబ్బినీడి వీరబాబు, ఎంపీటీసీ సభ్యురాలు వై.వీరవేణి, డీటీ కె.అనిల్‌కుమార్, కార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్ పూర్తి చేయండి

కరప: స్థానిక సామూహిక రక్షిత నీటి చెరువు వద్ద చేపట్టిన సుందరీకరణ పనులు, వాకింగ్ ట్రాక్ నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలని నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ సూచించారు. కరపలో శనివారం ఆయన స్థానిక నాయకులతో వాకింగ్‌ట్రాక్ నిర్మాణ పనులు పరిశీలించి వారం, పది రోజుల్లో పనులు పూర్తిచేసి, వినియోగంలోకి తీసుకురావాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కురసాల

శాకంబరి ప్రసాదం పంపిణీ

బోట్‌క్లబ్: స్థానిక ఉషా రాజరాజేశ్వరి సమేత భానులింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం శాకంబరి ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. శుక్రారం అమ్మవారికి అలంకరించిన కూరగాయలు, పండ్లను భక్తులకు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ వాకాడ వీరవెంకట సత్యనారాయణ (సత్తిబాబు), ఆలయ ఈఓ ఎం.మురళీవీరభద్రరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.